క్లుప్తంగా

రమణీయంగా కలశ పూజ



అప్పనపల్లిలో అయ్యప్ప స్వామి కలశ పూజలో పాల్గొన్న స్వాములు

మామిడికుదురు: అయ్యప్పస్వామి 18 కలశాల పూజోత్సవం సోమవారం రాత్రి అప్పనపల్లిలో రమణీయంగా జరిగింది. తులా శ్రీను, చిన్న స్వామి స్వగృహం వద్ద జరిగిన పూజలో భారీ సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో స్వాములు పేట తుళ్లి ఆడుతూ కలశాలతో వైనతేయ నదికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో నదీ జలాలు తీసుకు వచ్చి కలశ పూజ నిర్వహించారు. పెదపట్నానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. అయ్యప్ప స్వామికి పంచామృతాలు, పుష్పాలతో అభిషేకించారు. అనంతరం సహస్ర నామాలతో అర్చన చేశారు. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది.

కళాశాలకు కంప్యూటర్ల బహూకరణ



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ సుబ్బారావు

రాజోలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాజోలు రోటరీ క్లబ్ ప్రతినిధులు రెండు కంప్యూటర్లను మంగళవారం బహూకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోటరీ జిల్లా గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యా, ఆరోగ్య సంబంధ అంశాల తోడ్పాటుకు రోటరీ క్లబ్ అండగా నిలుస్తుందన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని మెర్సీకి ట్రై సైకిల్ అందిస్తామని రోటరీ గవర్నర్ సుబ్బారావు ప్రకటించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు నల్లి రాజు, శైలజ, అశ్వని, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, ప్రతినిధులు దార్ల పెదబాబు, బొరుసు తిరుమలరావు, నామన షణ్ముఖ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



రామేశ్వరంలో రైతులతో సమావేశం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సఖినేటిపల్లి: రామేశ్వరం, గుడిమూల గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు కట్టా ఉమామహేశ్వరరావు, దెందుకూరి శ్రీహరిరాజుల అధ్యక్షతన రైతులతో సమావేశాలు నిర్వహించారు. వరి పంటపై ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, తక్కువ పెట్టుబడితో అధిక లాభాల గురించి ఏవో పీవీ నరసింహారావు వివరించారు. ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోతికి వైద్య సేవలు



తూర్పుపాలెంలో కోతికి వైద్య సేవలు అందిస్తున్న పశువైద్య సిబ్బంది

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో గాయపడిన కోతికి స్థానికులు వైద్య సేవలు అందించారు. రోడ్డుపై వెళ్తున్న కోతిని బైక్ ఢీకొనడంతో కాలికి గాయమై నడవలేని స్థితిలో ఉంది. కేశనపల్లికి చెందిన అడబాల నరసింహారావు స్పందించి గ్రామ పశు సంవర్ధక సిబ్బంది చికిత్స అందించారు. నడవలేని స్థితిలో ఉన్న కోతికి గ్రామస్తులు ఆహారం అందించారు.

నిత్యావసరాల పంపిణీ

రాజోలు: సోంపల్లి ఇందిరా కాలనీకి చెందిన నిరుపేదలకు మంగళవారం రిటైర్డ్ పంచాయతీ అధికారి రొక్కాల ధనరాజు జ్ఞాపకార్థం నిత్యావసరాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ విప్పర్తి బేబీనాగలక్ష్మి పలు కుటుంబాలకు బియ్యం, కిరాణా సరకులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. నాయకులు విప్పర్తి సాయిబాబు, చందు, గొల్ల చిన్ని పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న మాజీ సర్పంచ్ బేబీనాగలక్ష్మి

వరి కోతలతో రైతుల బిజీ

- నిరాశజనకంగా ఖరీఫ్ దిగుబడి
- వరికోత యంత్రాలకు పెరిగిన డిమాండ్
- అమాంతంగా పెరిగిన కూలి ధరలు



పెదపళ్లలో వరికోత యంత్రాల ద్వారా జరుగుతున్న మాసూళ్లు

ఆలమూరు: ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఇప్పటి వరకూ ఆందోళన చెందిన రైతులకు కొంతమేర ఊరట లభించింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో రైతులు చురుగ్గా వరి కోతల్లో నిమగ్నమయ్యారు. ఆరుగాలం శ్రమించి తాము పండించిన పంట ఈ సారైన చేతికి వచ్చి సరైన గిట్టుబాటు ధర వస్తుందా అనే మీమాంస రైతుల్లో వ్యక్తమవుతుంది. క్లస్టర్‌లోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో సుమారు 28.5 వేల ఎకరాలు ఖరీఫ్‌లో వరిసాగు జరిగింది. ఈ సీజన్‌లో అధికశాతం విస్తీర్ణంలో వరి పంట తుది దశకు చేరుకోగా వివిధ మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కొంత మంది రైతులు రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన బొండాలు విత్తన ధాన్యం ఇప్పటికే బల్లకట్టు ద్వారా ఒబ్బిడి చేసుకున్నారు. ఈ ఖరీఫ్‌లో సీజన్‌లో ఇరిగేషన్ శాఖ సాగునీరు అరకొరగా అందించినా తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటం, ఆఖరి సమయంలో వాతావరణం అంతగా అనుకూలించకపోవడతో పంట మాత్రం నిరాశాజనకంగా పండింది. దీపావళి పండుగ కూడా వెళ్లిపోవడంతో సెంటిమెంట్ దృష్ట్యా రైతులు ఖరీఫ్ కోతలపై దృష్టి సారించారు. ఖరీఫ్‌లో ముందుగా వరినాట్లు వేసిన ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట, పి.గన్నవరం తదితర ప్రాంతాల్లో కొన్ని చోట్ల వరి కోతలు చురుగ్గా జరుగుతుండడగా మిగిలిన చోట్ల రైతులు కోతలకు సన్నద్ధమవుతున్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఈ నెలాఖరు నాటికి ఖరీఫ్ సీజన్ వరి కోతలు పూర్తవుతాయని వ్యవసాయశాఖ చెబుతుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 80 శాతం మేర స్వర్ణ రకాన్ని సాగు చేయగా మిగిలిన 20 శాతంలో ఎంటీయూ (1318), ఎంటీయూ (1326) రకాలను రైతులు సాగు చేశారు.

తగ్గుతున్న పంట దిగుబడి

ఖరీఫ్ సీజన్‌లో వరి పంట దిగుబడి అంత ఆశాజనకంగా లేదు. గత ఏడాది సీజన్‌లో ఎకరానికి 35 నుంచి 38 బస్తాల దిగుబడి రాగా ఈ సీజన్‌లో 25 నుంచి 30 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. ఈ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి అధిక వర్షాలతో పాటు ఈనిక దశలో తుపాన్లు సంభవించడంతో ధాన్యం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో పాటు ఎండు తెగులు, పిల్లపోటు, తెల్లకంకి తదితర తెగుళ్లు విజృంభించాయి. దీంతో వరి పంట దిగుబడి భారీగా తగ్గిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతు భరోసా కేంద్రాలు కొన్ని నిబంధనల సడలింపు ఇచ్చి క్వింటా ధాన్యాన్ని రూ.2300 వరకూ కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నా సరైన గిట్టుబాటు ధర లభించే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. మాసూళ్లు చేసిన పంటను సత్వరమే రైతు భరోసా కేంద్రాల ద్వారా మాత్రమే విక్రయించుకుని పంటకు సరైన మద్దతు ధర దక్కించుకోవాలని వ్యవసాయశాఖ సూచిస్తుంది.

వరికోత యంత్రాలకు విపరీతమైన డిమాండ్

తుపాన్ ప్రభావాలు అంతగా ఉండే అవకాశం లేదని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులందరూ ఒక్కసారిగా వరి కోతలను ప్రారంభించారు. దీంతో స్థానికంగా వరికోత యంత్రాలు సరిపోక పోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దళారులు విరివిగా దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో వరి కోత యంత్రాలకు తీవ్ర పోటీతత్వం ఏర్పడటంతో గంటకు రూ.2500 నుంచి 2800 వరకూ రుసుం వసూలు చేస్తున్నారు. కోతలన్నీ ఒకేసారి రావడంతో కూలీలకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇటీవల తుపాను ప్రభావం వల్ల నేలకొరిగిన వరి పంటను కోసేందుకు రైతులకు ఎక్కువగా కూలీల అవసరం ఏర్పడుతుంది. దీంతో అధికంగా మగ కూలీకి రూ.1000, మహిళ కూలీకి రూ.700 చెల్లించి పనులు చేయించుకోవలసిన పరిస్థితి రైతులకు ఏర్పడింది.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవాలి



రైతులు పండించిన పంటను రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవడం ద్వారా సరైన గిట్టుబాటు ధర లభిస్తుంది. ధాన్యంలో తేమశాతం లేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని విక్రయించిన వెంటనే రైతు ఖాతాలో పంట సొమ్ము జమ చేయడం జరుగుతుంది.

– ఎస్.లక్ష్మీ లావణ్య, ఏవో, ఆలమూరు

మద్దతు ధర పెంచాలి



వరి పంటకు మరింతగా మద్దతు ధరను పెంచి రైతులను ఆదుకోవాలి. ఈనిక దశలో వరుస తుపాన్ల వల్ల తెగుళ్లు సంభవించడంతో పాటు ధాన్యంలో తాలు గింజ (పొల్లు) ఎక్కువగా ఏర్పడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది.

– ఇల్లూరి పట్టాభి, రైతు, పినపళ్ల

104 సిబ్బందిని ఆదుకోవాలి



నగరం పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు



రామేశ్వరంలో పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

సఖినేటిపల్లి: 104 అంబులెన్స్ ద్వారా సేవలందిస్తున్న సిబ్బందిని ఆదుకోవాలని కోరుతూ మంగళవారం సఖినేటిపల్లి, రామేశ్వరం పీహెచ్‌సీల్లో వైద్యాధికారులకు 104 సిబ్బంది వినతి పత్రాలను అందజేశారు.

ఈ మేరకు వైద్యాధికారులు జయదుర్గ, దుర్గ కావ్య, యునుస్, సూరజ్‌లకు 104 స్టాఫ్ వినతి పత్రాలను ఇచ్చారు. డిమాండ్ల సాధనకై రాష్ట్ర వ్యాప్త దశల వారీ ఆందోళనలో భాగంగా వారు ఈ వినతి పత్రాలను అందజేశారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన జీతాలను చెల్లించాలని, 104 అంబులెన్స్ సర్వీసులను గతంలో మాదిరిగా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, 2020లో చేరిన వారికి జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడు ఏళ్లుగా జమ చేయని ఇంక్రిమెంట్లు ఏరియర్స్ రూపంలో చెల్లించాలని వంటి డిమాండ్లు ఆ పత్రాలలో వారు పేర్కొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించి తమ కుటుంబాలను ఆదుకోవాలని 104 సిబ్బంది డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలంటూ అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద 104 సిబ్బంది ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, ఉపాధ్యక్షులు రాజకుమారిల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేసి డాక్టర్ వి.గౌతమికి వినతిపత్రం అందజేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని వాటిని తక్షణం చెల్లించాలని కోరుతూ 104 ఉద్యోగులు మంగళవారం వినతిపత్రాలు ఇచ్చారు. నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వర్ణలత, స్పందనకు ఈ వినతి పత్రాలను అందజేశారు. 104 సర్వీసులను గతంలో మాదిరిగా ప్రభుత్వమే నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించే జీఓ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు.

ఆలమూరులో..

ఆలమూరు: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో పని చేస్తున్న 104 సిబ్బంది కోరారు.

రాష్ట్ర 108 సిబ్బంది సమాఖ్య పిలుపు మేరకు మంగళవారం వినతుల రూపంలో తమ నిరసనలను తెలియజేశారు. ఆయా పీహెచ్‌సీల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు లేక అర్థాకలితో జీవనం సాగిస్తున్నామని ఆవేదన చెందారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల వద్ద వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. డీఈఓ వి.రోజా, పైలెట్ ఎల్.రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేయించుకోవాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన మంగళవారం మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లను సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. మామిడికుదురు జెడ్పీ హెచ్ స్కూల్లో విద్యార్థులతో కలసి అసెంబ్లీలో పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు.

దేశంలో అత్యున్నత స్థానం నుంచి కింది స్థాయి వరకు నీతులు చెప్పే వారే తప్ప వాటిని ఆచరించే వారు కనిపించడం లేదన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణతో చదువుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు, అధ్యక్షుడు జీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, ఎ.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



చొప్పెల్లలో అయ్యప్పస్వామి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. ఆ గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు మురకొండ వెంకటేశ్వరరావు 18వ సారి అయ్యప్ప మాల ధరించి శబరిమల యాత్ర చేపడుతున్న సందర్భంగా ఈ పడిపూజను ఏర్పాటు చేశారు. కడియం మండలం తాడాల వీర వెంకటరావు గురుస్వామి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన శంకర గురుస్వామి ఈ పడిపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పద్దెనిమిది మెట్ల వేదికను అలంకరించిన తీరు, విగ్రహాల ఊరేగింపు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. స్థానిక మెయిన్‌రోడ్డులోని రైసుమిల్లు ఆవరణలో అత్యంత భారీ వ్యయంతో నిర్వహించిన పడిపూజకు మండపేట, కొత్తపేట, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. అలాగే వందలాది మంది భక్తులు ఈ పడిపూజను తిలకించి భక్తి పారవశ్యం చెందారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- నాగేంద్రునికి భక్తుల పూజలు
- పుట్టల వద్ద సందడి
- బాణసంచా కాల్చి చిన్నారుల ఆనందం



పెదపట్నంలంకలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఎల్.గన్నవరం అక్విడెక్ట్ సమీపాన పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొత్తపేట: నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. దీపావళి అమావాస్య తరువాత వచ్చే చవితి నాడు నాగుల చవితి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మంగళవారం వేకువజామునే భక్తులు పొలాలు, తోటలు, ఏటిగట్లు, కాలువ గట్ల వద్ద ఉన్న పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కాలంలో పుట్టలు కనుమరుగవడంతో వాటిని వెతకడానికి భక్తులు అవస్థలు పడ్డారు. అక్కడక్కడా కనిపించిన పుట్టల వద్దకే అనేక మంది భక్తులు చేరుకుని పూజలు చేశారు. ప్రధానంగా కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అనాదిగా ఉన్న పుట్ట వద్దకు అత్యధిక సంఖ్యలో గ్రామ భక్తులు చేరుకుని పూజలు నిర్వహించారు. చిన్నా పెద్దా అంతా పుట్టల వద్ద నాగదేవతా.. నాగరాజా అంటూ పుట్టలో పసుపు, కుంకుమ, పాలు, కోడిగుడ్లు, తేగ, బుర్రగుంజు, చలివిడి, చిమ్మిలి తదితర ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పిల్లలు దీపావళి నాడు మిగిలిన బాణసంచా కాల్చి సందడి చేశారు. మండలంలోని గంటి చిల్లకోడు డ్రైన్ పక్కన స్వయంభూ నాగమ్మ ఆలయానికి అత్యధిక సంఖ్యలో భక్తులు చేరుకుని పూజలు చేశారు. ఈసారి నాగుల చవితి మంగళవారం రావడంతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: నాగుల చవితి సందర్భంగా మంగళవారం మామిడికుదురు, నగరం, పెదపట్నం, బి.దొడ్డవరం, పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నం లంక, మొగలికుదురు, గెద్దాడ తదితర గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను భక్తులు సందర్శించి నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: కార్తికమాసంలో వచ్చే తొలి పండుగ నాగుల చవితి. ఈ పర్వదినాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లోని భక్తులు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నాగేంద్రుడి కరుణ కటాక్షాలు ఉంటే విష సర్పాల వల్ల ఎటువంటి రుగ్మతలు దరిచేరవని భక్తుల విశ్వాసం కావడంతో గ్రామాల్లోని వ్యవసాయ కుటుంబీకులు ఎక్కువగా ఈ నాగుల చవితి పండుగను జరుపుకొంటారు. దీంతో ఆయా గ్రామాల్లో మహిళలు, రైతులు సుదూర ప్రాంతాల్లోని పొలాలకు వెళ్లి పుట్టలో పాలు, కోడిగుడ్లు, చిమ్మి, పాలు తదితర ప్రసాదాలను పుట్టలో వేసి నాగేంద్రుడికి నైవేద్యాన్ని అందజేశారు. నాగ సర్పాల పుట్టల వద్ద భక్తులు బాణసంచాను కాల్చి భక్తిని చాటుకున్నారు. గతంలో ఏ పొలాల్లో చూసినా కనిపించే పాము పుట్టలు లేఅవుట్ల ఏర్పాటు, సామాజిక ప్రభావం నేపథ్యంలో పాముల పుట్టలు కనుచూపు మేరలో కనిపించడం లేదు.. పుట్టల కొరత ఎక్కువగా ఉండటంతో ఆయా గ్రామాల్లో గుర్తించిన పుట్టల వద్ద వద్ద భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో భక్తులు పూజలు నిర్వహించేందుకు తీవ్రంగా శ్రమించవలసి వచ్చింది.

అంబాజీపేటలో...

అంబాజీపేట: మండలంలో నాగులచవితిని ప్రజలు మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల్లో ఉన్న పొలాలు, దేవాలయాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు పాలు, గుడ్లు, తేగలు తదితర పూజ సామగ్రి వేసి పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా మహిళలు, చిన్నారులు ఈ పూజల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో ఉన్న దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: నాగుల చవితి పర్వదినాన్ని మండలంలో భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు వేసి నైవేద్యాలు సమర్పించి నాగేంద్రునికి పూజలు చేశారు. స్థానిక అక్విడెక్టుకు ఇరువైపులా ఉన్న పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. చిన్నారులు బాణసంచా కాల్చారు. పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో భక్తులకు అన్న సమారాధన చేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: పలు గ్రామాల్లో నాగుల చవితిని మంగళవారం ఘనంగా చేసుకున్నారు. ఆత్రేయపురం శ్రీవల్లీ, దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, వినాయక, రాధాకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారి పుట్టలో పాలు పోసుకున్నారు. వాడపల్లి, వసంతవాడ, పేరవరం, ర్యాలి, వెలిచేరు, వద్దిపర్రు తదితర గ్రామాల్లో భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన దంపతులు సంతానం కోసం కుజదోష, నాగదోషాలను నివారించుకునేందుకు అభిషేకాలు చేయించుకున్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: గ్రామాల్లో నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చవితి సందర్భంగా మహిళలు, పిల్లలు, ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి పొలాల్లోని, పుంత గట్ల సమీపంలో ఉన్న పాముల పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి ఆవుపాలు, కోడిగుడ్లు, బుర్రగుంజు, చిమ్మిలి, చలివిడి తదితర ప్రసాదాలను భక్తిశ్రద్ధలతో పుట్టల్లో వేశారు. అలాగే పుట్టల చుట్టూ ప్రదక్షిణలు చేసి నాగదేవతకు మొక్కుకున్నారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు.

8న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట: పుల్లేటికుర్రులో అభయాంజనేయ స్వామి వారి 27 అడుగుల ఆవిష్కరణ, శిలామయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఆ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 6న విష్వక్సేన, పుణ్యాహవాచనం, ప్రతిష్ఠ సంకల్పం, 7న వేద స్వస్తి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆంజనేయ స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకాలు, యజ్ఞపాయన హోమం జరుగుతాయన్నారు. 8న శిలామయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆవిష్కరణ, మహాశాంతి హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

అంబాజీపేట: ఖరీఫ్ పంటకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. చిరతపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సర్పంచ్ కోట బేబీరాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు క్వింటాలు సాధారణ రకం ధాన్యం రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320 చొప్పున కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. రైతులకు నచ్చిన మిల్లర్లకు ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఏఈఓ డి.దుర్గారావు, వీహెచ్‌ఏ ఎం.రవితేజ, వెటర్నరీ అసిస్టెంట్ బి.ఆనందకుమార్, రైతులు సూరిశెట్టి సుబ్బారావు, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభ

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తోట భవాని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక రైతుల నుంచి స్వీకరించిన 23 దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ నేత దొడ్డా సుబ్బారావు, ఎంపీటీసీ తోలేటి సంతోషి, కార్యదర్శి ఎస్.వీర్రాజు, మండల రెవెన్యూ అధికారి ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ఎం.ప్రభావతి, గ్రామ కార్యదర్శి జె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనం తనిఖీ



ఎండీయూ వాహనదారుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ సరకుల పంపిణీ (ఎండీయూ) వాహనాల తనిఖీ మంగళవారం జరిగింది. సాధారణ తనిఖీల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబుతో కలసి కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ తనిఖీలు నిర్వహించి రేషన్ పంపిణీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే సరకులు అందుతున్న తీరు, నాణ్యతా ప్రమాణాలను లబ్ధిదారులను ఆరా తీశారు. రేషన్ పంపిణీలో అవలంబించవలసిన విధానాన్ని ఎండీయూ వాహనదారులకు ఆర్డీవో శ్రీకర్ వివరించారు. డీటీ టి.సుబ్బరాజు, ఆర్ఐ పి.రావాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతి నేతల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

కొత్తపేట: ఆధునిక యుగంలో వెనుకబడిన కులాల్లో చైతన్యం నింపిన జాతి నాయకుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు పిలుపునిచ్చారు. ఏపీ బీసీ/ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ ద్వితీయ కార్తిక వనసమారాధన ఈ నెల 10 న అమలాపురం సమీప కొంకాపల్లిలో నిర్వహిస్తున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వన సమారాధన ఆహ్వాన పత్రికను మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీ సభ్యులు నేలపూడి భీమరాజు, పేపకాయల బ్రహ్మానందం, బీసీ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి రేవాడి దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు గుత్తల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన మద్దిపట్ల గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు రూ.30,300, ఐరగవరం మండలం ఆర్.ఖండ్రికకు చెందిన బొబ్బిలి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు రూ.10,016, బెంగళూరుకు చెందిన వెలివెల సాయి సమీర్–భవ్య మంజూష దంపతులు రూ.10,116 మొత్తంగా రూ.50,432 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.